ప్రజాశక్తి
ఆదివారం 15 డిసెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

వదలని గజరాజులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలోని నందివానివలసలో శనివారం ఏనుగులు తామర చెరువులో ఉన్నట్టు స్థానికులు తెలిపారు. గత కొంతకాలంగా వివిధ మండలాల్లో సంచరించిన గజరాజులు మళ్లీ మండలంలో ప్రవేశించడంతో నందివానివలస, పరిసర ప్రాంత ప్రజలు ఎప్పుడు ఏం జరుతుందోనని భయందోళనతో ఉంటున్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు బిక్కుబిక్కు మంటూ ప్రయాణం సాగిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి వెంటనే ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్‌ఛార్జీల భారం తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన జిల్లాలో కరెంటు బిల్లులు దగ్ధం

పార్వతీపురంలో కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సర్దుబాటు ఛార్జీలపేర్లతో వచ్చిన అదనపు విద్యుత్‌ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లులను శనివారం దహనం చేశారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక పాతబస్టాండ్ వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రమం వద్ద విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, అదానీతో విద్యుత్తు ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నేడు ఆదానికి అమ్ముడు పోయి విద్యుత్తు ట్రూ ఆప్ చార్జీలను రూ.16,850 కోట్లు ఆర్థికభారాలు ప్రజలపై వేశారని విమర్శించారు. ఇవి చాలవన్నట్లు అదానీ స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ బిగిస్తున్నారని, సంక్షేమమూ, అభివృద్ధి, సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇపుడు ట్రూ ఆప్ ఛార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదని అన్నారు. విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చార్జీలపేర్లతో వచ్చిన అదనపు ఛార్జీలు తగ్గించాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకట రమణ, పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, బొత్స లక్ష్మి, సిహెచ్ వెంకటరమన, వారణాశి శ్రీను, నిమ్మకాయల సుందరరావు, పాలకొండ వెంకన్న, రోహిణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని రావికోన, గంగాపురం పంచాయతీ పరిధిలో గల రంగాలగుడా, తానవలసలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రామస్వామి ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.శంకరరావు, కె.గంగన్న, ప్రసాద్, పి.రాము, వారాలు, కె.చిరంజీవి, ఎం.రాము, ప్రజలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అడ్డాపుశీల పంచాయతీ బొంటు వానివలసలో విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమాన్ని సిపిఎం నాయకులు చేపట్టారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దుచేయాలని, ఆదానితో విద్యుత్తు ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే ఆపాలని సిపిఎం జిల్లా కమిటీసభ్యులు రెడ్డి వేణు, మండల కార్యదర్శి బంటు దాసు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మరిశర్ల సింహాచలం, ఎ.కూర్మయ్య, గుంటిరెడ్డి ఉమమ్మ, కె.నాగమణి, మహిళలు, యువత పాల్గొన్నారు.

పాలకొండ : విద్యుత్‌ఛార్జీల భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణ దగ్గర నిరసన చేపట్టి, విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దావాల రమణారావు, మండల కమిటీ సభ్యులు ఎ.లక్ష్మణరావు, డి దుర్గారావు, కె.రాము, ఎన్‌కె రాజపురం శాఖ కార్యదర్శి ఎం.రమేష్, చిరు వ్యాపారు ఎస్ ప్రసాదు, వినియోగదారులు పాల్గొన్నారు.

సాలూరు : విద్యుత్ ఛార్జీలు పెంచి పేదలపై భారాలు వేయడానికి నిరసిస్తూ పట్టణంలో విద్యుత్ బిల్లుల ను దగ్ధం చేసిన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్వై నాయుడు మాట్లాడుతూ విద్యుత్ భారాలు ఆపకుంటే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆదినారాయణ, ఈశ్వరరావు, రాణి, అర్జున్, ప్రజలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని పివి ఈత మానుగూడలో విద్యుత్ బిల్లులను సిపిఎం నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పీత వీరన్న, పి.తోటన్న, సంజీవ రావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : లివిద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ మండలంలోని పెదభోగిలి, బుడ్డిపేట, రామవరం, రెడ్డివానివలస, బగ్గందొర వలసలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకట రమణ, రెడ్డి లక్ష్మునాయుడు, ఆర్.ఈశ్వరరావు, పి.చిన్నారావు, బొత్స శ్రీను, అచ్యుతరావు, త్రినాధ, సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో పెంచిన విద్యుత్ భారాలు తగ్గించాలని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే మూలజమ్మూ, ఇరిడి, సప్పగూడ, కేశివడ, దుడ్డుఖల్లు, బొడ్డ గూడ గ్రామాల్లో పెరిగిన కరెంటు బిల్లులకు వ్యతిరేకంగా కరెంటు బిల్లులు దహనం చేశారు. ట్రూ అప్ తదితర అన్ని రకాల అదనపు భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, నాయకులు కె గౌరీశ్వరరావు, కె.సన్యాసిరావు, పువ్వల మోహన్‌రావు, కిల్లక సుబ్బారావు, కె.లక్ష్మి తదితరులు ఉన్నారు. అలాగే జియమ్మ వలస మండలం గడసింగపురం పంచాయతీ ఏనుగులగూడలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కే సీతారాం, నాయకులు ఎం రామారావు, ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో బలిజిపేట, నారాయణపురం, పలగర, వంతరాం, గంగాడలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుల యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం పెంచిన విద్యుత్‌ఛార్జీలను తగ్గించాలని, లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భానుమూర్తి, దన్నాన త్రినాధ, పి.వెంకటస్వామి, బలరాంనాయుడు, అప్పారావు, గంగులు, విశ్వేశ్వరరావు, సురేంద్రతదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని కుమ్మరి గుంట పంచాయతీ డంగ భద్ర, కొమరాడలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ట్రూ ఆప్ ఛార్జీల భారం తగ్గించాలని కోరుతూ విద్యుత్తు వినియోగదారులతో కలిసి సిపిఎం నిరసన తెలుపుతూ విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాకాడ ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి గిరిజన సంఘం నాయకులు రామారావు, మహిళలు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

సాలూరు, పాలకొండలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురంలో కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

గరుగుబిల్లి : విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా సుంకిలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి సూర్యనారాయణ, దాసరి వెంకట నాయుడు, కునుకు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం సీనియర్ నాయకులు సూకురు అప్పలస్వామి ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ గాంధీ బొమ్మ ఆవరణలో నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దుచేసి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, విద్యుత్ బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు.**సాలూరు రూరల్ :** పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బట్టివలసలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంతల శివ, మర్రి రాజు, వంతల చిన్న, మర్రిమసి, వంతల సాంబ పాల్గొన్నారు

సీతంపేటలో దీక్షలు చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

డెప్యుటేషన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలకు వేసిన అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నీరస శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఐటిడిఏ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నీరస శ్రీనివాసరావు మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులు డీఎస్సీలో నోటిఫై చేసినందున వారు విధులు బహిష్కరించారని చెప్పారు. ఈనేపథ్యంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను ఆ పాఠశాలల్లో డిప్యూటేషన్లు వేయటం సరికాదన్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని, కానీ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు వందల కిలోమీటర్ల దూరంలో, ఇతర జిల్లాలకు డిప్యూటేషన్లు వేయడం సమంజసం కాదన్నారు. వెంటనే ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో ఈనెల 17న ఐటిడిఎ కార్యాలయాలను పెద్దఎత్తున ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పోలినాయుడు, కె.గోవిందరావు, మండల శాఖ అధ్యక్షులు బంటు జగన్నాథం, రాయుడు, మురళీకృష్ణ, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు, సిఆర్టీలు పాల్గొన్నారు.

సీతంపేట : గిరిజన సంక్షేమ సెకండరీ గ్రేడ్ టీచర్లు, సిఆర్‌టిలను 400 కిలోమీటర్ల దూరంలో గల పాడేరుకు డిప్యుటేషన్ వేయడం సరైంది కాదని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు డిమాండ్ చేశారు. పనిచేస్తున్న మండలంలో లేదా పక్క మండలంలో సర్దుబాటు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.ఆనందరావు, బి.పకీరు, నాయకులు బి.జయప్రకాష్, ఎ.రాము, కె.సింహాచలం, పలువురు సిఆర్‌టిలు, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

- **పాలకొండలో ఓటరు జాబితా, పోలింగ్ సామగ్రి అపహరణ**
- **పలుచోట్ల వాయిదా**

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కువ సంఘాలను కూటమి మద్దతు దారులు కైవసం చేసుకున్నారు. పాలకొండ మండలం నవగాం పాఠశాలలో పణుకువలస టిసికి ఎన్నిక జరుగుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు పోలింగ్ బూత్ నుంచి ఓటరు జాబితా, పోలింగ్ సామాగ్రి దొంగలించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ ఎన్నిక వాయిదా పడింది. అంపిలి 2 టిసీల ఎన్నిక గోపాలపురం పాఠశాలలో జరగ్గా, అక్కడ వివాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి, డిఎస్‌పి రాంబాబు అక్కడకు చేరుకొని పరిస్థితి చక్కదిద్దారు. సీతానగరం మండలం అంటిపేట, నిడగళ్ల ప్రాదేశికాలకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. మక్కువ మండలం సురాపాడు ఆయకట్టు పరిధిలో జరిగిన ఎన్నికల విషయమై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఆ నీటిసంఘం పరిధిలో గల గిరిజన రైతాంగం ఎన్నికలను బహిష్కరించింది. అలాగే కన్నంపేటలో పోటీదారుల నామినేషన్ పత్రాలను అధికారులు తిరస్కరించడంతో వారు కోర్టును ఆశ్రయించారు.

మక్కువ మండలం ఎర్రసామంతవలస వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

వాడీవేడిగా ఎన్నికలు

పాలకొండ : ఎన్నో ఏళ్ల తర్వాత శనివారం జరిగిన నీటిసంఘాల ఎన్నికలు మండలంలో వాడీవేడిగా జరిగాయి. మండలంలో 11 సంఘాల పరిధిలో 114 టీసీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, 106 ఏకగ్రీవమయ్యాయి. పణుకువలస ఎన్నిక వాయిదా పడింది. అంపిలి 2, బాసూరు 1, ఎం సింగుపురం 1, ఆవలింగి 3 టీసీలకు ఎన్నికలు జరిగాయి. నవగాం పాఠశాలలో పణుకువలస టిసికి ఎన్నిక జరుగుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు పోలింగ్ బూత్ నుంచి ఓటరు జాబితా, పోలింగ్ సామాగ్రి దొంగలించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ ఎన్నిక వాయిదా పడింది. అంపిలి 2 టీసీల ఎన్నిక గోపాలపురం పాఠశాలలో జరగ్గా, అక్కడ వివాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి, డిఎస్‌పి రాంబాబు అక్కడకు చేరుకొని పరిస్థితి చక్కదిద్దారు. ఎవరూ అల్లర్లకు పాల్పడొద్దని సూచించారు. అలాగే నవగాంకు చేరుకొని పణుకువలస టిసి ఎన్నిక వాయిదా వేశారు. సిబ్బంది బాధ్యతారాహిత్యంగా ఉండడం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిబంధనలు పాటించని ఎన్నికలు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న స్వరాపాడు ఆయకట్టు గిరిజనులు

కన్నంపేట ఎన్నికలపై కోర్టుకు వెళ్తామంటున్న రైతులు

మక్కువ : ఆయకట్టు సంఘాల ఎన్నికలు నిబంధనలకు నీళ్ల వదులుతున్నారని, ఎన్నికలంటే ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్వహిస్తారని సురాపాడు ఆయకట్టు గిరిజన రైతాంగం అధికారులను నిలదీవారు. మండలంలోని ఎర్రసైమంతవలస ఆశ్రమ పాఠశాలలో శనివారం జరిగిన ఎన్నికలను వారు బహిష్కరించారు. గతంలో ప్రతి ఊరిలోనూ దండోరా వేయించే వారిని, ప్రతి రైతుకు తెలిపే వారని ఈసారి అధికారులు ఇవేవీ పాటించలేదని గిరిజనుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటూ 99 శాతం ఉన్న గిరిజనులను పక్కకు పెట్టే ప్రయత్నం చేశారని, దీన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామని వారు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయకట్టుకు సంబంధించిన పెదవుటగెడ్డ, ఎర్ర సామంత వలస, ఆడారు, పనసభద్ర, మూల వలస గిరిజన గ్రామాల ప్రజలు తెలిపారు.

కోర్టుకు వెళతాం

మండలంలోని కన్నంపేట ఆయకట్టు సంఘం ఎన్నికల జరిగిన తీరుపై కోర్టును ఆశ్రయిస్తామని టిడిపి నాయకులు, న్యాయవాది బలగ రామకృష్ణ అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు మరిపి అప్పలనాయుడు, గంటా పాపారావు అఫిడవిట్లు సమర్పించి నామినేషన్ పత్రాలు ఇచ్చినప్పటికీ ఏ విధమైన కారణాలు చూపకుండా తిరస్కరించారని, నోటీసు బోర్డులో పేర్లు కూడా నమోదు చేశారని, అయితే కారణాలు చూపడం లేదని అన్నారు. ఎన్నికల నిబంధనలో తప్పనిసరిగా నీటి తీరువా పన్ను నో డ్యూ పొందుపర్చాలని లేనప్పటికీ అధికారుల వ్యవహార శైలి దారుణంగా ఉందన్నారు. ఎదుటి పోటీదారులు ఎవరూ కూడా అభ్యంతరాలు తెలపకపోయినా నామినేషన్లు తిరస్కరించడం ఉద్దేశపూర్వకంగా ఉందన్నారు దీనిపై అప్పలనాయుడు, పాపారావులకు జరిగిన అన్యాయంపై కోర్టులో రిట్‌వేస్తామని ఆయన వెల్లడించారు .

పసర మందుకు పసికందు బలి

గిరిజన తల్లిదండ్రుల అవగాహన లోపం

వైద్యానికి దూరంగా గిరిశిఖర గ్రామాలు

ప్రజాశక్తి - సాలూరు/పాచిపెంట

పసర మందుకు ఓ పసికందు బలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకవైపు వైద్యరంగంలో కృత్రిమ మేధ(ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్)ను ఉపయోగించి అనూహ్య ఫలితాలు సాధించే దిశగా అడుగులు పడుతుంటే మన్యం జిల్లాలో మాత్రం వైద్యమంటే తెలియని అమాయక గిరిజనులుండడం గమనార్హం. పాచిపెంట మండలం బొర్ర మామిడి పంచాయతీ బొడ్డపాడు గిరి శిఖర గ్రామంలో ఆరునెలల చిన్నారి పోయి మంజుకి అనారోగ్యం రావడంతో వైద్యం అందించాలనే కనీస అవగాహన లేకపోయింది. గ్రామంలో ఆశా కార్యకర్త ఉన్నారని, ఆమె సాయంతో ప్రభుత్వ ఆసుపత్రి కి వైద్యం కోసం వెళ్లాలనే ఆలోచన కూడా ఆ చిన్నారి తల్లిదండ్రులు పోయి మెరకమ్మ, లక్ష్మణరావుకు రాలేదు. ఫలితంగా వారి ఆరునెలల కుమార్తె మంజు చేజారిపోయింది. చూడ్డానికి ఎంతో ముద్దు గా, బొద్దుగా కనిపిస్తున్న చిన్నారి మంజుకి అనారోగ్యం వచ్చిందని తల్లిదండ్రులు సమీపంలో ఉన్న నాటు వైద్యాన్ని ఆశ్రయించారు. దీని కారణంగా చిన్నారి మంజు ప్రాణాలు కోల్పోయింది. ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గిరిజన గ్రామాల్లో గిరిజనుల వెనుకుబాటుతనానికి ఈ సంఘటన మచ్చుతునక. మృతి చెందిన చిన్నారి పోయి మంజు తల్లిదండ్రులు మెరకమ్మ, లక్ష్మణరావు ఇద్దరూ నిరక్షరాస్యులు కావడంతో వారికి ప్రభుత్వ వైద్యంపై అవగాహన లేకపోయింది. మంజు వీరికి మూడో సంతానం.

మృతి చెందిన చిన్నారి మంజు

గురివినాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే మంజు పుట్టింది. ఇంతకుముందు పుట్టిన ఇద్దరు పిల్లలు కూడా మృత్యువాత పడ్డారు. ఒకవైపు గిరి శిఖర గ్రామాల్లోనూ వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని జిల్లా అధికారులు గొప్పలు చెప్పుకొంటున్న తరుణంలో వైద్యం గురించి అవగాహన లేక నాటు వైద్యంతో కన్నబిడ్డలను కోల్పోతున్న గిరిజనులెంతో మంది ఈ గిరిశిఖర గ్రామాల్లో వున్నారు. పిహెచ్‌సిలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, ఎఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు ఇలా ఎంతో మంది గ్రామాల్లో వున్నా గిరిజనులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్ష లాగే ఉంది.

అవగాహన కల్పించాలి:కోరాడ ఈశ్వరరావు, సిపిఎం నాయకులు

మారుమూల గిరిజన గ్రామాల్లో, గిరి శిఖర గ్రామాల్లో గిరిజనులకు ప్రభుత్వ వైద్యం గురించి అవగాహన కల్పించాలి. పిల్లల పెంపకం, ఆరోగ్యంపై వైద్య సిబ్బంది పర్యవేక్షణ వుండాలి. చదువులేని కారణంగా ఇప్పటికీ అనేకమంది గిరిజనులు పసరమందు, నాటు వైద్యం ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా కన్నబిడ్డలను కోల్పోతున్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందని రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జిల్లా జడ్జి కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించామన్నారు. ఈ అదాలత్‌తో ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాలను వేగవంతం చేయడం, సామరస్యపూర్వక పరిష్కారాలను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకున్నామని జడ్జి చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉండి, సమర్ధవంతమైన న్యాయాన్ని అందించాలనే లక్ష్యంతో లోక్‌అదాలత్ పని చేస్తుందని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న వివాహ, ఆస్తి వివాదాలు, మోటారు ప్రమాద క్లెయిమ్‌లు, భూసేకరణ, పరిహారం, సర్వీస్ మరియు లేబర్‌కు సంబంధించిన కేసులతో సహా సెటిల్‌మెంట్ అంశాలను కలిగి ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంతో దూరం నుంచి కక్షిదారులు కోర్టులకు వస్తున్నారని, లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల వారికి మానసిక వత్తిడి తగ్గడమే కాకుండా, ఖర్చులు కూడా తగ్గుతాయని అన్నారు. ఇలాంటి లోక్‌అదాలత్ కార్యక్రమాలను ప్రతి కక్షిదారుడు సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో ఉన్న కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా సీనియర్ లాయరు గంటా అబ్బాయి కుటుంబ ఆస్తుల తగాదాను రాజీ చేవామని లాయరు టి. జోగారావు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస రావు, లోక్ అదాలత్ సభ్యులు ఎమ్.వెంకటరమణ, ఎస్.క్రిష్ణ, కె.బాపూజీ, జి.లక్ష్మణరావు, ఆర్.గంగరాజు అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

కక్షిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

కురుపాం : జాతీయ లోక్ అదాలత్ స్థానికకోర్టుకు సంబంధించి పార్వతీపురం కోర్టులో శనివారం లోక్ అదాలత్ చైర్మన్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య జోసఫిన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌లో కురుపాం కోర్టుకు సంబంధించి 54 కేసులను పరిష్కరించారు. ఇందులో ఎక్సైజ్ శాఖకు సంబంధించి 22 కేసులు, ఐపిసికి సంబంధించి 4 కేసులు, పిఎల్‌సికి సంబంధించి 2 కేసులు, ఎస్టిసికి సంబంధించి 26 కేసులను పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్ సభ్యులుగా న్యాయవాది బారాటం చంద్రమౌళి, ఎన్ జి ఓ గొటారి వెంకటరావు పాల్గున్నారు.

అంతటా ఏకగ్రీవం... పలు చోట్ల వాయిదా

స్వల్ప వివాదాలు మినహా ప్రశాంతంగా నీటిసంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో శనివారం జరిగిన సాగు నీటి సంఘాల ఎన్నికలు ఎక్కువగా ఏకగ్రీవంగా కాగా, పలుచోట్ల అక్కడక్కడ స్వల్ప వివాదాలతో వాయిదా పడ్డాయి. ఇందులో భాగంగా పార్వతీపురం మండలంలోని 26 చోట్ల టిడిపి ఏకగ్రీవంగా ఎంపిక కాగా, రెండు చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. బందలుప్పికి చెందిన బడిదేవర గెడ్డ కాలువ స్థానానికి ఆరు టిసిలకు గాను, ఐదు ఏకగ్రీవం కాగా ఒక స్థానానికి ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో బొబ్బాది సూర్యనారాయణకు మిగతా ఐదు గురు టీసీలు మద్దతు ఇవ్వగా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అలాగే ములగలోలో టిడిపి, వైసిపికి చెందిన సాగుదారుల్లో ఉపాధ్యక్షుని ఎంపికలో ఇరు వర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు పోలింగ్ అధికారి ప్రకటించారు. అలాగే సంఘంవలస తమ్మి నాయుడు చెరువు పాలకవర్గం ఎంపికలు ఎంఆర్ నగరానికి చెందిన సాగుదారుల్లో టిడిపి, వైసిపి వర్గాల్లో అధ్యక్షుని స్థానానికి గానూ ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, ఈలోగా ఎన్నిక సమయం ముగియడంతో ఇక్కడ కూడా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. మండలంలోని 28 స్థానాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగినట్లు రూరల్ ఎస్సై సంతోషికుమారి తెలిపారు. వాయిదా పడ్డ రెండు సంఘాలకు ప్రభుత్వం ప్రకటించే తదుపరి సూచనల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ డిఇ ఉదయభాస్కర్ తెలిపారు.

సాలూరు: మండలంలోని పురోహితునివలస నారాయణసాగరం నీటి సంఘం ఎన్నికల్లో వైసిపి విజయం సాధించింది. ఆరు టిసిలకు ఎన్నిక నిర్వహించగా ఐదింటిలో వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. సంఘం అధ్యక్షుడిగా చింతల సత్యం, ఉపాధ్యక్షుడిగా బంకురు సూర్యనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక టిడిపి నాయకుల ఒత్తిడి మేరకు ఎన్నిక వాయిదా వేయించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఫలితం వైసిపికి అనుకూలంగా మారింది.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

బలిజిపేట : మండలంలోనిసాగునీటి సంఘాల ఎన్నికలు 90 శాతం వరకు ఏకగ్రీవంగా జరిగాయి. పది పంచాయతీల్లో స్వల్ప వివాదాల వల్ల అక్కడ ఎన్నిక జరగలేదు. మండలంలో 10 గ్రామాల్లో 16 సాగినటి సంఘాలకు ఎన్నికలు

పాచిపెంట : బలరాంను అభినందిస్తున్న నాయకులు

నిర్వహించగా అందులో 4 మీడియం, 12 మైనర్ సంఘాలు ఉన్నాయి. ఒక మీడియం సంఘంలో 12 టీసీలు ఉండగా అందులో సభ్యులకు ఈ ఎన్నికలు నిర్వహించారు. ఒక మైనర్ సంఘంలో ఆరు టీసీలు ఉండగా అందులో సభ్యులకు ఎన్నికలు నిర్వహిస్తారు. కొన్ని గ్రామాల్లో టీసీలో ఉన్న సభ్యులు హాజరు కాకపోవడంతో ఎన్నికలు జరగలేదని అధికారులు చెప్పారు. నారాయణపురం, పలగర, అరసాడ, పెదపెంకి గ్రామాల్లో మీడియం సంఘాల్లో పెదపెంకి తప్ప అన్ని గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పెదపెంకిలో పోటీ జరిగింది. అరసాడ 1, అజ్జాడ 2, గంగాడ 3, గలవిల్లి 2, తుమరాడ 1, వంతరాం 1, బర్లి 1, పెద్దపెంకిలో 12 మైనర్ సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. అయితే అజ్జాడలో ఒక మైనర్ సంఘానికి ఎన్నికలు జరిగి మరొక మైనర్ సంఘానికి ఎన్నికలు జరగలేదని, గళావల్లిలో కూడా ఎన్నికలు ఒకదానికి జరగలేదని ఇరిగేషన్ ఎఇ జి కవిత తెలిపారు.

భామిని: మండలంలోని 25 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించినట్లు ఇరిగేషన్ డిఇ రంగునాయకులు తెలిపారు. పెద్దదిమిలి, బురుజోల నీటి సంఘాలు మినహాయించి మిగిలిన 23 నీటి సంఘాలు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బురుజోల, పెద్దదిమిలిలో నీటి సంఘం సభ్యులు రాకపోవడం వల్ల నీటి సంఘం ఎన్నికలు జరగలేదు అని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ మధు, తహశీల్దార్ అప్పారావు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని పాంచాలిలో నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు బి సత్యనారాయణ, పి.వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానికజడ్పీ ఉన్నత పాఠశాలలో టిసి నెంబర్-3కు ఎన్నికల నిర్వహించగా అధ్యక్షులుగా మతల బలరాం, ఉపాధ్యక్షులుగా వెంకట నాయుడును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పాంచాలి పాఠశాలలో టిసి నెంబర్4కు సంబంధించి ఎన్నికలు జరగ్గా అధ్యక్షులుగా గుంట్రోతు పార్వతి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు తహశీల్దార్ డి రవి. ఎంపిడిఒ బివిజె పాత్రో పర్యవేక్షణలో సజావుగా జరిగాయి. తమ అభ్యర్థుల విజయం పట్ల టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు.

సీతంపేట : మండలంలోని మర్రిపాడులో నీటిసంఘానికి అధ్యక్షులుగా అనసూయ, ఉపాధ్యక్షులు ఎద్దు కృష్ణ ప్రసాద్ ఎన్నికయ్యారు. అలాగే లోకొత్తవలసకు అధ్యక్షులుగా బుచ్చయ్య, ఉప అధ్యక్షుడిగా శ్రీరాములు ఎన్నికయ్యారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలంలో నీటి సంఘాలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చిన మేరంగి, పరజపాడు, జియ్యమ్మ వలస, గౌరమ్మపేట, శిఖ బడి, కుదమ, గెడ్డ తిరువాడ, ఒట్టిగెడ్డ పరిధిలో ఉండగా మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తోటపల్లి ప్రాజెక్ట్ ఎడమ కాలువ పరిధిలో పెదబుడ్డిడి నీటి సంఘం ఒకటి. ఈ 9 నీటి సంఘాల పరిధిలో 108 టిసి సభ్యులు ఉంటే 97 టిసి సభ్యులు ఏకగ్రీవం కాగా, పదిచోట్ల ఎన్నికలు జరిగాయి . శిఖబడిలో ఒక్క టీసీ సభ్యుని ఎన్నిక వాయిదా పడింది. చింతల తిరుపతి అనే వ్యక్తి నో డ్యూ సర్టిఫికెట్ సకాలంలో అందించకపోవడం ప్రధాన కారణం. ఇదిలా ఉండగా మైనర్ ఇరిగేషన్ పరిధిలో గల తాళ్లడుమ్మ, అర్నాడ, జోగిరాజుపేట, గడసింగపురం, డంగ బద్ర పరిధిలో ఉన్న 30 టిసి సభ్యులు ఏకగ్రీవమయ్యారు. మేజర్ ఇరిగేషన్‌లో ఉన్న ఒక నీటి సంఘం, మీడియం ఇరిగేషన్‌లో ఉన్న 8 నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నిక ఏకగ్రీవమయ్యాయి. ఇదిలా ఉండగా వైసిపి మద్దతుతో టిడిపికి చెందినవారు ఈ ఎన్నికల్లో ఏకగ్రీవం చేసుకున్నారని టిడిపి నాయకులు, ఎంపిపి బొంగు సురేష్ బహిరంగంగా చెప్పడం గమనార్హం. ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చినమేరంగి సిఐ టివి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్సైలు ప్రశాంత్ కుమార్, అనీష్ గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అలాగే పెదబుడ్డిడి పంచాయతీ నీటి సంఘం అధ్యక్షులుగా రౌతు శశిభూషణ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెదబుడ్డిడి పంచాయతీ పరిధిలో ఆరు టీసీలు ఉండగా అన్నీ కూడా ఏకగ్రీవమయ్యాయి. ఉపాధ్యక్షులుగా ముదిలి సత్యనారాయణ ఎన్నికయ్యారు. వీరు ఎంపిక కావడం పట్ల కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, స్థానిక తెలుగు రైతు అధ్యక్షులు శ్రీరామ్మూర్తి అభినందించారు.

పెదబుడ్డిడి టిసి అధ్యక్షులుగా ఎన్నికైన శశిభూషణరావు

కురుపాం : మండలంలో జరిగిన నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తహశీల్దార్ ఎం.రవణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 22 నీటి సంఘం ఎన్నికలకు 22 కూడా ఎన్నికలు ఏకగ్రీవం కాగా, ఎక్కడ కూడా ఘర్షణలకు దారి తీయకుండా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. న్నికలు పరిశీలకులుగా ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి , ఇరిగేషన్ , ఆర్డబ్ల్యూష్ , తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని 10 మేజర్, మూడు మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి వీరఘట్టం 2, కత్తులకవిటి 2, నీలానగరం 1 టీసీలకు ఎన్నికలు జరిగాయి. మిగిలిన చోట ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. వీరఘట్టం నీటి సంఘం అధ్యక్షులు చింత ఉమామహేశ్వరరావు, నడుకూరు వెలగాడ శ్రీనివాసరావు , కొట్టు గుమ్మడ కొంచాడ రామకష్ణ నాయుడు, విక్రంపురం మాచర్ల నందీశ్వర రావు, కంబర పొదిలాపు విజయ రమణి, నడిమికల్లా గుంట్రెడ్డి రామకష్ణ, నర్సిపురం అల్లు సత్యం నాయుడు, కె.ఇచ్ఛాపురం శంకరాపు పాండురంగారావు, తుడి ఖండాపు హరిబాబు, చిదిమి బౌరోత్ సుజాత, వండువ కడగల గణపతిరావు, నీలానగరం బి.హరనాథ్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహశీల్దార్ చెప్పారు. ఈ ఎన్నికలను సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు.

సాలూరు రూరల్ : మండలంలో 11 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా 10 టిడిపి సానుభూతిపరులు, ఒకటి వైసిపి సానుభూతి పరులు గెలుపొందారు. కొన్ని సంఘాల్లో అధ్యక్షులు టిడిపి సానుభూతిపరులు వుంటే ఉపాధ్యక్షులుగా వైసిపికి చెందిన వారు ఎన్నుకోబడ్డారు.

గరుగుబిల్లి : తోటపల్లి పాత రెగ్యులేటర్ కుడి కాలువ పరిధిలోని కొత్తూరు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈమేరకు కొత్తూరు నీటి వినియోగదారుల సంఘం పరిధిలో 12 ప్రాదేశిక నియోజకవర్గం సభ్య లకు టి సి (మెంబర్ లు) ఎన్నికలు నిర్వహించగా, అన్నీ ఏకగ్రీవయ్యాయని ఎన్నికల అధికారి దత్తి అప్పలనా యుడు తెలిపారు. నామినేషన్ కార్యక్ర మంలో మరడాన తవిటినాయుడు, మాజీ ఎంపిపి ద్వారపురెడ్డి ధనుంజయరావు, పెద్దింటి శ్రీధర్, యేగిరెడ్డి సింహాచలంనాయుడు, గుంట్రెడ్డి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాపురం టిసికి అధ్యక్షులుగా ఎంపికైన నర్సింగరావు

16 ఏకగ్రీవం... అంటిపేట, నిడగల్లు వాయిదా

సీతానగరం: మండలంలోని శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో 16 గ్రామాల్లో నీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అంటిపేట వెంగళరాయసాగరు మెంబర్ల ఆరు ఇంటికి ఎన్నిక వాయిదా పడింది. నిడగల్లు పోతినాయుడు చెరువు, నీలకంఠ సాగరానికి ఎన్నికల వాయిదా వేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మండలంలోని వెంకటసాగరం, కృష్ణారాయపురం నుంచి అధ్యక్షులుగా గుణుపూరు నరసింగరావు, ఉపాధ్యక్షులుగా పోల బలరాంనాయుడు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా మంత్రబుడ్డి మన్మధరావు, గుణుపూరు అప్పలనాయుడు, గుణుపూరు సత్యం నాయుడు, గుణుపూరు పురుషోత్తం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పెదభోగిలి వెంకటరాయుడి చెరువు అధ్యక్షునిగా ఇజ్జాడ రాంబాబు, ఉపాధ్యక్షునిగా శిరీషాల కాంతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వం దిగి రావాలి

గిరిజన గురుకుల టీచర్లతో చర్చలు జరపాలి

మద్దతు పలికిన ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వం వెంటనే గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యకులు మువ్వల అమరనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జరిగిన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సామూహిక నిరాహార దీక్షల్లో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గిరిజన విద్యా రంగాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్లేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను గిరిజన గురుకులాలకు ఎలా డెప్యూటేషన్ వేస్తారని ప్రశ్నించారు. ఈ చర్యల వల్ల అటు గురుకులాల్లోనూ, ఇటు ఆశ్రమాల్లో గిరిజన విద్యార్థులకు చదువుల్లేని పరిస్థితి వచ్చిందని అన్నారు. ఇటువంటి అనాలోచిత, అశాస్త్రీయ ఆలోచనలు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు రంజిత్ కుమార్, గణపతి, భగవాన్, అవుట్ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, వెంకట్, రాజేష్, రమేష్, కామేష్, మురళి, లక్ష్మి జ్యోతి, కవిత, దీప, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన వీరేష్

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో తన నివాసం వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో గల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు లేనటువంటి పాఠశాలన్నిటికీ సహకరించి మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు.

లోకేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీరేష్

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నఖచిత్రాయణం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాకు చెందిన ప్రముఖ నఖచిత్ర చిత్ర కళాకారుడు పల్ల పరిశినాయుడు చిత్రీకరించిన చిత్రాలతో కూడిన గోటి బొమ్మల కొలువు నఖచిత్రాయణం చిత్ర సాహితీ అను మూడు పుస్తకాలను శనివారం పార్వతీపురం భాస్కర్ కళా మండపంలో సాహితీ లహరి వ్యవస్థాపకులు మంచి పల్లి శ్రీరాములు ఆవిష్కరించారు. కాపారపు ఫౌండేషన్ అధినేత కాపరపు శివున్నాయుడు, విశ్రాంతి ఎస్‌పి కె.భార్గవ, ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు, భాస్కర్ విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కర్, శ్రీకాకుళం గురజాడ విద్యాసంస్థల అధినేత జివి స్వామి నాయుడు చిత్రకారుడు పరిశినాయుడు కృషి కొనియాడారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

పరిశీలనకు వెళ్లా... పారిపోలేదు : తహశీల్దార్

ప్రజాశక్తి - మక్కువ

నీటి సంఘ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా పోలింగ్ బూత్‌లను పరిశీలించేందుకు శుక్రవారం వెళ్లానని, అంతేగాని ఎక్కడికీ పారిపోలేదని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం విలేకరులకు తెలిపారు. రాజకీయ పార్టీలు వారి హక్కుల ప్రకారం ఆందోళన చేయడం పరిపాటేనని, అలాగని వారు చేసే ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. టిడిపి తరఫున పోటీ చేసే వారికి శుక్రవారం రాత్రి నో డ్యూయల్ ఇచ్చానని ఆరోపించడం సరికాదన్నారు. పనసభద్ర బూత్ పరిశీలన సాయంత్రం ఆరు గంటలకు పైబడిందని అనంతరం సమయంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్టు తెలిపారు. పోటీలో పాల్గొనే వ్యక్తులు తప్పకుండా రసీదులు చూపించాలని ఎన్నికల జీవోలో ఉందన్నారు. కన్నంపేటలో నామినేషన్లు తిరస్కరణ విషయమై ప్రస్తావించగా, నిబంధనల మేరకే తిరస్కరించినట్టు అక్కడ అధికారులు తెలిపారని అన్నారు.

విలేకరిపై దాడికి వ్యతిరేకంగా రాస్తారోకో

ప్రజాశక్తి - సాలూరు

కడప సాక్షి విలేకరి పై టిడిపి నాయకుల దాడికి నిరసనగా శనివారం పట్టణంలో జాతీయ రహదారిపై విలేకరులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ విలేకరుల పై దాడులు చేయడం దుర్మార్గమని చెప్పారు. అనంతరం తహశీల్దార్ ఎస్ వి రమణ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు విశ్వేశ్వర రావు, చంద్రమౌళి, కృష్ణారావు, నాగేశ్వరరావు,కూర్మారావు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు అలవాటుగా మారాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇంధన పొదుపు అలవాటుగా మారాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక అన్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నుండి ఈనెల 20 వరకు జరగనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు అలవాటుగా మార్చుకోవాలని తద్వారా విద్యుత్తు పొదుపు కావడమే కాకుండా అవసరాలకు సరిపడా ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. వృథాను అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ ఇంధనం పొదుపుపై అవగాహన తప్పనిసరి అన్నారు. సాంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఇడి బల్బులను వాడుదామని తద్వారా 60 శాతానికి పైగా విద్యుత్ ఆదా చేద్దామని పిలుపునిచ్చారు. యూనిట్ విద్యుత్తును ఆదా చేయడం వల్ల రెండు యూనిట్లు ఉత్పత్తి భారం తగ్గుతుందన్నారు. ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతి రావు మాట్లాడుతూ ఇంధన పొదుపుపై జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిఇస్తామని, స్వయం సహాయక మహిళలకు ముగ్గుల పోటీలు, ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అన్న అంశంపై నిష్ణాతులతో ఎంఆర్ నగరం పాలిటెక్నిక్ కళాశాలలో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. విద్యుత్ పొదుపుపై అవగాహనకు గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించే పోటీలలో విజేతలకు ఈనెల 20న బహుమతుల ప్రదానం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇఇ వేణుగోపాల నాయుడు, ఇతర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి శోబిక

అరటి, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అరటి, జీడి మామిడి ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాసెసింగ్ యూనిట్లపై సంబంధిత అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జీడి మామిడి పంట అధికంగా ఉందని తద్వారా ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పి మరింత ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. సాలూరు, సీతంపేట, గుమ్మలక్ష్మీపురంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు ప్రాథమిక నివేదిక తయారు చేయాలని అన్నారు. జీడి పంట సేకరణకు స్వయం సహాయక సంఘాలు, గిరిజన సహకార సంఘం సహకారాలను తీసుకోవడం మరింత దోహదం చేస్తుందని ఆయన సూచించారు. ఉద్యానవన శాఖ అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి సంబంధిత యూనిట్ల లాభదాయకతను గూర్చి గ్రామాల్లో రైతులతో చర్చించాలని ఆదేశించారు. అరటి పంటతో అరటి పండ్లు మాత్రమే కాకుండా అరటి చెట్టు కాండము, ఇతర భాగాల నుండి అనేక ఉప ఉత్పత్తులు తయారు చేయవచ్చని ఆయన పేర్కొంటూ ఆయా ఉత్పత్తులకు అవసరమగు కార్యాచరణ తయారు చేయాలన్నారు. సాలూరు, జియ్యమ్మవలస, మక్కువ తదితర ప్రాంతాల్లో అరటి పంట విస్తృతంగా ఉందని వాటిని చక్కగా సద్వినియోగం చేసుకోవడం వల్ల జిల్లాలో రైతులకు లాభదాయకత వచ్చి ఆదాయం మెరుగు కాగలదని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ కె రామచంద్రరావు, ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి మనీ భూషణ్, జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజ, ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పసికందు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

ప్రజాశక్తి - సీతంపేట

నవజాత శిశువుల ప్రాణ రక్షణలో 108 అంబులెన్స్ ఆపద్బాంధవుగా నిలుస్తోంది. అత్యవసర వేళ అపర సంజీవనిలా ప్రత్యక్షమవుతోంది. అనారోగ్యంతో ఉన్న పసికందును ఆగమేఘాలపై ఆసుపత్రికి చేరుస్తోంది. ప్రాణాపాయం నుంచి తప్పించి తల్లిదండ్రులకు ఆనందాన్ని పంచుతోంది. చిన్నారుల మరణాల కట్టడిలో కీలక భూమిక పోషిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

మండలంలోని తోటగూడకు చెందిన సవర శారద రెండో కాన్పు నిమిత్తం సీతంపేట ప్రభుత్వాసుపత్రిలో చేరింది. శనివారం తెల్లవారుజాము నుంచి నొప్పులు ఆగి వస్తూ ఉండడంతో 10 గంటల సమయంలో పండంటి బాబుకు జన్మను ఇచ్చింది. అయితే ఆ నవజాత శిశు వు ఉమ్మనీరు తాగడంతో పుట్టిన వెంటనే ఏడవలేదు. ఎటువంటి కదలికలు లేవు.. ఆ సమయంలో చిన్నపిల్లలు వైద్యనిపుణులు సుభాష్, మనోజ్ కుమార్ శిశువుకు ఇన్క్యూబేట్ చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పాలకొండ నవజాత శిశు అంబులెన్సు సిబ్బంది ఇఎంటి జి.గణపతి, పైలట్ మురళి స్పందించి బేబీని అంబులెన్సులోకి తీసుకుని ఇఆర్‌సిపి డాక్టర్ రవి సూచనలు మేరకు అత్యవసర చికిత్సను ఇస్తూ, అంబులెన్స్ బ్యాగ్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్ కు సకాలంలో తరలించారు. మార్గమధ్యలో పసికందుకుకదలికలు కూడా రావడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం బాబు ప్రాణాపాయం నుండి బయటపడి, వెంటిలేటర్ ద్వారా చికిత్స పొందుతున్నాడు.

ఆక్సిజన్ సాయంతో శిశువును తరలిస్తున్న 108 సిబ్బంది

ఉపాధిహామీ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల జిల్లా కార్యవర్గం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో శనివారం ఎస్‌సి, ఎస్‌టి ఉపాధిహామీ ఉద్యోగుల సంఘం ఏర్పాటైంది. సంఘం లేని కారణంతో ఎస్సి, ఎస్టీ ఉపాధి హామీ ఉద్యోగుల సంక్షేమం, భద్రత, వారి హక్కులను పట్టించుకునే అవకాశం లేకుండా పోయిందని, ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యవర్గం ఏర్పాటైనట్లు కొత్తగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఎపిఒ భాను ఆధ్వర్యంలో పార్వతీపురంలో జరిగి సమావేశంలో గంటా రామకృష్ణ జిల్లా అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, ఉపాధ్యక్షులుగా మందంగి హరనాథ్, తుట్ట తిరుపతి, కార్యదర్శిగా ఇసి చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, ట్రెజరర్ గా భద్ర, వెంకటరమణను ఎన్నుకున్నారు.

హిమోగ్లోబిన్ పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ట్రూ హెచ్.బి పరికరంతో హీమోగ్లోబిన్ పరీక్షల శిక్షణ వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో, హైరిస్క్ గర్భిణీ నిర్వహణ నియమాలపై శిక్షణ స్థానిక ఎన్జీఒ హోమ్‌లో శనివారంనిర్వహించారు. వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు ఈ కార్యక్రమాల్లో పాల్గొని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య పరికరాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా, వాటి నాణ్యత మెరుగ్గా ఉండేలా జాగ్రత్త పర్చాలన్నారు. అవసరమైన వారికి కొత్త హెచ్.బి డివైజ్‌ను అందజేశారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానంతో మెరుగైన ఫలితాలకు కృషి చేయాలన్నారు. ట్రూ హెచ్.బి పరికరంతో అక్కడ సిబ్బంది పరీక్ష చేయు విధానాన్ని గమనించారు. ఆర్మన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీకృత అధిక ప్రమాద గర్భదారణ నిర్వహణ నియమాలు శిక్షణలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ గర్భిణుల్లో ప్రమాదకర ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించడం అత్యంత ఆవశ్యకమని, తద్వారా హైరిస్క్ సమస్యను ఏవిధంగా నివారించాలి, అందుకు అవసరమైన కార్యాచరణ సత్వరమే చేపట్టాలని అన్నారు. వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌పిటిఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రశాంత్, మెడికల్ ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణమూర్తి, రిగ్ నానో సిస్టం ఇండియా టెక్నికల్ ఇంజినీర్స్ డి.దుర్గాప్రసాద్, ఎస్.ఇమ్రాన్, కార్యాలయ ఇఒ శ్రీనివాసరావు, ఎన్ఎం, సిహెచ్ఒలు తదితరులు ఉన్నారు.

పోరుదారిలో ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు పేరుకుపోతున్న ప్రజా సమస్యలు... మరోవైపు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు... ఇంకోవైపు పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాంటి రాజకీయ వేధింపులు... వెరసి ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజానీకం పోరుబాట పట్టింది. రోడ్లపైకి వచ్చి తమ ఆవేదనను, ఆక్రోశాన్ని తెలియజేస్తున్నారు. ఈ నెల 17న విద్యుత్తు బిల్లులు తగలబెట్టేందుకు కూడా సిద్ధమౌతున్నారు. ఇందులో వామపక్ష పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, వాటి అనుబంధ సంఘాలు మాత్రమే కాదు.., చివరికి ఆర్నెల్ల క్రితం వరకు అధికారంలోకి ఉండి, సమస్యలపై పోరాడిన ప్రజల్ని, నాయకుల్ని నిర్బంధాలు, అక్రమ కేసులకు గురిచేసిన వైసిపి కూడా ప్రజలకు దూరం కాకుండా ఉండేందుకైనా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధాన పరంగా మాత్రం వైసిపి ప్రజాపోరాటాలకు కలిసి రాలేదు సుమా...! ఎందుకంటే గతంలో కేంద్ర ప్రభుత్వం విధానాలను నాటి వైసిపి ప్రభుత్వం అమలు చేసినట్టే, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అమలుకు కంకణం కట్టుకుంది. అందువల్లే విధానపరమైన వ్యతిరేకతకు వైసిపి ఆమడదూరంలో ఉంటోంది. గడిచిన వారం రోజుల్లో జరిగిన పరిణామాలు ప్రజాపోరాటాలు, విధానపరమైన వైరుధ్యాలు తెలుసుకునేందుకు బోధపడతాయి. ప్రస్తుతం ట్రూఅప్ ఛార్జీలతో విద్యుత్తు భారం పెరిగింది. జనవరిలో మరో దఫా పెంచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీనిపై ఇప్పటికే వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం, ఆ పార్టీ అనుబంధ సంఘాలు శక్తిమేర ప్రజల్ని ఐక్యం చేసి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకనుగుణమైన పోరాటాలు చేసేందుకు మాత్రం వైసిపి సిద్ధంగా లేదు. ఎందుకంటే గతంలో వైసిపి కూడా విద్యుత్తు ఛార్జీల పెంపునకు అనుగుణమైన సంస్కరణల అమలుకు రాష్ట్రంలో పెద్దపీట వేసిది. ఆ మేరకు ప్రజలపై భారాలు కూడా పడ్డాయి. మరోమాటలో చెప్పాలంటే ఎటువంటి భారమూ వేయబోమంటూ ప్రచారం చేయడం ద్వారా టిడిపి ఇటీవల జరిగిన ఎన్నికల్లో లబ్ధిపొందింది. అందువల్లే విధాన పరమైన అంశాల విషయంలో టిడిపి, వైసిపి దొందూ దొందేనని, ఇంకా చెప్పాలంటే బిజెపి తానులో ముక్కలు వంటివేనని పలువురు విశ్లేషిస్తున్నారు.

ఇక ప్రజా సమస్యల విషయానికి వస్తే... ఎన్నికల్లో గెలిచాక రూ.15 వేల రైతుభరోసాకు బదులు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని రైతులకు అందిస్తామని టిడిపి నమ్మబలికిన సంగతి తెలిసిందే. అమలుకొచ్చేసరికి మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరు జిల్లాల్లోనూ వైసిపి ఆధ్వర్యాన నిన్నగాక మొన్న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టారు. వినతిపత్రాలు ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు ధర్నాలు చేసిన వారిని అవహేళన చేసినట్టుగా నిర్బంధాలు, బెదిరింపులు, అక్రమ కేసులు పెట్టిన వారు సైతం చివరికి ఆందోళనబాట పట్టడం గమనార్హం. ఏదేమైనా ప్రజా సమస్యలపై పోరాడటం మంచి పరిణామమే. కాకుంటే పదవులు, అధికారం శాశ్వతం కాదన్న విషయం తెలుసుకోవాలని అంటున్నవారు కూడా లేకపోలేదు. వీటి సంగతి అటుంచితే, తమకు వేతనాలు పెంచాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని, భవన సౌకర్యం కల్పించాలని వివిధ తరగతులకు చెందిన ప్రజలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు గడిచిన వారంలో తీవ్ర ఆందోళనలు చేపట్టాయి. ధాన్యం కొనుగోలు చేసి, మద్దతుధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నాపురం జ్యూట్ మిల్లు తెరిపించాలంటూ అక్కడి కార్మికులు విజయనగరంలో సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. తమకు రూ.15 వేలు కనీస వేతనం చెల్లించడంతోపాటు మెస్ బిల్లులు ఇవ్వాలని, ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున మెస్ ఛార్జీలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పోరుబాట పట్టారు. వేతన బకాయి చెల్లించడంతోపాటు తమను పుట్‌టైం కార్మికులుగా గుర్తించాలంటూ ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లోని ఆయాలు ఆందోళన చేస్తున్నారు. ఈ నెల 16న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు కూడా సన్నద్ధమౌతున్నారు. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవన సదుపాయం కల్పించాలని అక్కడి విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చాలా కాలంగా పోరాడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా వరండాలు చదువులు సాగిస్తూ నిరసన తెలిపారు. ఇదే విషయమై పట్టణ పౌర సంక్షేమ సంఘం సంతకాల సేకరణ చేపట్టింది. కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ అంబాసిడర్లు ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. రాజకీయ కక్షతో తొలగించిన గజపతినగరం మండలం రామన్నపేట అంగన్‌వాడీ సెంటర్ ఆయా సౌజన్యను విధుల్లోకి తీసుకోవాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆరు రోజులుగా నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. సూపర్ సిక్స్ అమలు చేయలేదంటూ జనం కోడై కూస్తున్నారు. అందులో ఇప్పటికే అమలు చేశామంటున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అరకొరగానే ఉంది. తమ ఖాతాల్లో నగదు బదిలీ జమకావడం లేదంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేయడమే ఇందుకు తార్కాణం. ఇలా సగటు కుటుంబం ప్రభుత్వ పాలనపైనా, రాజకీయ వేధింపులు, కక్ష సాధింపు చర్యలపైనా ప్రభుత్వంపై గుర్రుగా ఉంటోంది.

మండ పాఠశాలను సందర్శించిన ఒడిశా ఎస్‌ఆర్‌పి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఒడిశాలోని కోరాపుట్ జిల్లా హై స్కూల్ టీచర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ బాసిక్ నాయక్ మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ, పరిసరాలు, పాఠశాల విద్యా బోధన చూసి ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణంలో కూరగాయలు, పూలతోటల పెంపకం చూసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాలక దేవానంద్,

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం చినమేరంగి ప్రతాప్‌నగర్ కాలనీలో ఈనెల 2న అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబ బాధితులకు తెలకల సంఘం జిల్లా అధ్యక్షులు జి టి ఎస్ ప్రసాద్ ప్రధాన కార్యదర్శి రావుపల్లి చంద్రశేఖర్ రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ నగదును కుటుంబ యజమాని సింహాచల కు అందజేశారు. కార్యక్రమంలో తెలకలి సంఘం చినమేరంగి పెద్దలు మండల పరిషత్ కో ఆప్షన్ నెంబర్ శివప్రసాద్ బ్రహ్మ ఉన్నారు.